ముస్తాబైన బలివే శైవక్షేత్రం


విద్యుత్ అలంకరణలో శోభాయమానంగా మారిన ఆలయ ప్రాంగణం


రంగుల రాట్నాలతో సందడిగా మారిన ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో గంగా పార్వతీ సమేత బలే రామలింగేశ్వరస్వామి

పెదవేగి : బలివే శైవక్షేత్రం శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. విద్యుత్ అలంకరణల నడుమ శైవక్షేత్రాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. మూడురోజులపాటు ఇక్కడ నిర్వహించనున్న ఉత్సవాలకు సుమారు నాలుగు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. దీంతో ఉత్సవాలకు నిర్వహణకు ప్రజాప్రతినిధులు, దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బలివే సోమద్రి నది తీర వాసి గంగా పార్వతీ రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆఫ్నాయక శర్మ పొన్నూరి మల్లిఖార్జునరావు తెలిపారు. పెదవేగి మండలం విజయరాయి శివారు బలివే తిరునాళ్ల ప్రారంభం సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మల్లికార్జునరావు మాట్లాడుతూ స్వామివారి దివ్యదర్శనానికి, తిరునాళ్లకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారన్నారు. భక్తులు ఇబ్బంది పడకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, దేవస్థాన అధికారులు పూర్తి చేశారని చెప్పారు. ఇక్కడ జరగనున్న తిరునాళ్లలో భక్తులను అలరించేందుకు బుల్లెట్ ట్రైన్, రంగుల రాట్నం తదితర వాటిని ఏర్పాటు చేశారు.

బలివే భక్తుల కోసం పటిష్ట బందోబస్తు


విజయరాయిలో మాట్లాడుతున్న నూజివీడు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్

పెదవేగి : మహాశివరాత్రి పర్వదినం రోజున విజయరాయిలో భక్తులకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ అధ్యక్షతన విజయరాయి సొసైటీలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నూజివీడు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బలివే వెళ్లేందుకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా భక్తులు అందరూ ప్రశాంత వాతావరణంలో స్వామి దర్శనం చేసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎంపీడీవో రాజ్‌మనోజ్ మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని, వైద్య ఆరోగ్య సిబ్బంది చే వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని, మంచి నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో పెదవేగి సీఐ ఎస్.దుర్గాప్రసాద్, ఎస్సై ఎం.లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య, సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టు స్కూల్ ప్రోగ్రాం


విద్యార్థులకు ప్రయోగ ప్రదర్శన, వాటి ఆవశ్యకతను వివరిస్తున్న అధ్యాపకులు

ఉంగుటూరు : నేర్చుకున్న అంశాన్ని ప్రయోగాత్మకంగా తెలుసుకున్నప్పుడే పూర్తి స్థాయి అవగాహన కలుగుతుందని నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీకే విశ్వేశ్వరరావు అన్నారు. కళాశాల రసాయన శాస్త్రం ఐక్యూఏసీ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ల్యాబ్ టు స్కూల్ ప్రోగ్రాం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రయోగ ప్రదర్శన విజ్ఞానశాస్త్రం పట్ల అభిరుచిని పెంపొందిస్తుందన్నారు. ప్రయోగాల రూపకల్పనలో విద్యార్థుల భాగస్వామ్యంతోనే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఈ సందర్భంగా బీఎస్సీ విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు వివిధ ప్రయోగాలతో శాస్త్రీయ అంశాలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మీరాసాహెబ్, ఐక్యూసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి, రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకులు హెబ్సిబా, వృక్ష శాస్త్ర అధ్యాపకులు ఎస్‌కే అయేషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ


విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం : రక్తహీనతతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని, తలనొప్పి, శ్వాస సంబంధిత వ్యాధులు, తీవ్ర అలసట వంటి సమస్యల వల్ల చదువులో వెనుకబడతారని కాశిపాడు హైస్కూల్ హెచ్ఎం బి.కాంతిశ్రీ అన్నారు. గురువారం రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సహాయకుడు నామాల రాజు మాట్లాడుతూ ఐరన్ లోపం వల్ల రక్త హీనత ఏర్పడి ఆరోగ్య సమస్యలు వస్తాయని, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రంగనాయకులు, మంజుల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చేపలు పట్టుకునే హక్కు వేలం వాయిదా


వేలం నిర్వహిస్తున్న ఈఓఆర్డీ సూర్యకుమార్

పెదపాడు : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వేలం వాయిదా వేసినట్లు ఈఓఆర్డీ సూర్యకుమార్ తెలిపారు. గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీకి చెందిన పశువుల చెరువులో స్వాభావికంగా పెరిగిన చేపలను పట్టుకునే హక్కును వేలం నిర్వహించారు. ఈ వేలంలో సరైన ధర రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నాణ్యతను పరిశీలించిన ఎస్ఈ


రహదారి నాణ్యతను పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ ఎస్ఈ చంద్రభాస్కరరెడ్డి

పెదపాడు : మండలంలోని కలపర్రు – కొక్కిరపాడు రహదారి పనులను పంచాయతీ రాజ్ ఎస్ఈ జీ చంద్రభాస్కర్‌రెడ్డి తనిఖీ చేశారు. రహదారి నిర్మాణంలో నాణ్యతను పరిశీలించారు. జీఎస్‌బీ నాణ్యత ప్రమాణాల మేరకు ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. రహదారి పనులు ముమ్మరం చేయాలని వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. నిర్మాణ జాప్యానికిగల కారణాన్ని రహదారి నిర్మాణ సంస్థను అడిగి తెలుసుకున్నారు. టెండర్లు వేసి పనులు చేయకుంటే ఎలా అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గంలోని వివిధ రహదారులు నిర్మాణం ప్రారంభించాలని లేకుంటే టెండర్లు రద్దు చేసి డిఫాల్టరుగా కంపెనీని ప్రకటిస్తామని చెప్పారు. ఆయన వెంట డివిజనల్ ఇంజినీర్ జె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జలకళ బోరు నిర్మాణానికి శంకుస్థాపన


సానిగూడెంలో బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కామిరెడ్డి నాని

దెందులూరు : వైఎస్సార్ జలకళ పథకం పేద రైతులకు వరమని, రైతుల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. గురువారం సానిగూడెం గ్రామంలో యడ్ల వెంకటరత్నం పొలంలో వైఎస్సార్ జలకళ పథకంలో నూతనంగా మంజూరైన బోరు నిర్మాణ పనులను నాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సనిపల్లి రామకృష్ణ(విష్ణు), పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఫ్రాన్సిస్, ఫీల్డ్ అసిస్టెంట్ జయరాజు, నాయకులు కోరంశెట్టి ధనుంజయరావు, రాజేష్, శనపల్లి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఉన్నారు.

మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మోటార్‌సైకిల్ చోరీపై గంగుల పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. స్థానిక గరుడపక్షినగర్‌కు చెందిన పవన్‌కుమార్ ఈ నెల 11వ తేదీ రాత్రి ఇంటి వద్ద మోటార్‌సైకిల్‌ను పార్క్ చేశాడు. మరోసటిరోజు ఉదయం లేచి చూసేసరికి మోటార్ సైకిల్ కనిపించలేదు. అప్పటి నుంచి వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎంపీ శ్రీధర్‌ను కలిసిన నిర్వాసితులు


ఎంపీ కోటగిరి శ్రీధర్‌తో కుక్కునూరు, కివ్వాక నిర్వాసితులు

కుక్కునూరు : పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధిలో ముంపునకు గురవుతున్న కుక్కునూరు ఏ బ్లాక్, కివ్వాక గ్రామాల ఇంటి విలువలకు సంబంధించి ప్రచురించిన పేపర్ నోటిఫికేషన్‌లో పలువురి నిర్వాసితుల పేర్లు రాలేదన్న విషయమై రెండు గ్రామాలకు చెందిన నిర్వాసితులు గురువారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ, ఇంటివిలువలకు సంబంధించి గతంలో పంచాయతీలలో ఉంచిన జాబితాలో తమ పేర్లు మిస్సైయిన విషయమై ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్యను కలిసి విన్నవించగా ఆయన గ్రామసభల నాటికి విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, కాని ఇంతవరకు జాబితాలో పేర్లు చేర్చలేదన్నారు. తమకు న్యాయం చేయాలని ఎంపీని కలిసి విన్నవించినట్లు చెప్పారు.

పోషకాహారంతో కంటి వ్యాధులు దూరం


విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: కంటికి సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని, తగిన జాగ్రత్తలు, పోషకాహారం తీసుకుంటే కంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. గురువారం మండలంలోని డి.కుముదవల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు కంటిపరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందచేస్తామన్నారు. సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ ఏవిటమిన్ అధికంగా లభించే ఆకుకూరలు, పాలు, గుడ్డు, క్యారెట్ వంటి ఆహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు, ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా 250 మంది విద్యార్థులకు కంటిపరీక్షలు చేశారు. వీరిలో 16మందికి కళ్లజోడు పడినట్లు ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం హరిహరనాథ్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి


మొయ్యేరులో రజకుల సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

గణపవరం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రజకుల సమస్యలను పరిష్కరించాలని రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకపల్లి కట్లయ్య అన్నారు. గురువారం మండలంలోని మొయ్యేరులో మండల రజకజన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రజకుల చెర్వులు చాలా గ్రామాలలో ఆక్రమణలకు గురయ్యాయని, చాలా చెర్వులు పూడుకుపోయి, నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయి రజకులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రజకుల వృత్తి చెర్వులన్నింటిని లోతుచేయాలని ఆయన కోరారు. ఈ విషయాలను ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. రజకుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 23న ఏలూరులో నిర్వహించే మహాసభకు పెద్ద సంఖ్యలో రజకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రజకజన సంఘం జిల్లా నాయకుడు బుద్దారపు పుల్లయ్య, సభ్యులు కె.సుబ్బయ్య, వీర్రాజు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం


మానవ అక్రమ రవాణాపై వివరిస్తున్న ప్రజ్వల సంస్థ ప్రతినిధి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రజ్వల స్వచ్ఛంద సేవా సంస్థ (హైదరాబాద్) రాష్ట్ర సమన్వయకర్తలు కె.బలరామ కృష్ణ, వై.చంద్రయ్య తెలిపారు. మానవ అక్రమ రవాణా అంశంపై స్థానిక కస్తూర్బా నగరపాలక బాలికోన్నత పాఠశాల, బాల గంగాధర్ తిలక్ ఓరియంటల్ హైస్కూల్‌లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రేమ, సినిమాలు, మోడలింగ్‌లో అవకాశాలు, వివాహం, విద్యాపరమైన అవకాశాలు, ఉద్యోగ అవకాశాలు వంటి కారణాలను చూపి యువతులను వాణిజ్యపరమైన లైంగిక దోపిడీకి గురి చేస్తున్నారని వివరించారు. ఇంటర్నెట్, సైబర్ ట్రాఫికింగ్ ద్వారా యువతుల రహస్య వివరాలు సేకరించి లోబరుచుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా, వాణిజ్యపరమైన లైంగిక దోపిడీకి సంబంధించిన నిజమైన బాధితుల కథనాల డాక్యుమెంటరీలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కస్తూర్బా, బీజీటీఓ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు జి.సునీత, షడ్రక్ ప్రజ్వల, స్వచ్ఛందస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మలకుమారి

గణపవరం: స్థానిక చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని వసతులతో, పూర్తి స్థాయి అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి చెప్పారు. గురువారం గణపవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, చాణక్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులను డిగ్రీ కళాశాలకు ఆహ్వానించి వారికి కళాశాలలో వసతులు, ల్యాబొరేటరీ, లైబ్రరీ సదుపాయాలను చూపించారు. డిగ్రీలో వివిధ సబ్జెక్టులు, కోర్సులపై అవగాహన కల్పించారు. కళాశాలకు న్యాక్ గుర్తింపు ఉందని, కళాశాలలో కంప్యూటర్ సైన్సు కోర్సులు ప్రవేశపెట్టారని విద్యార్థులకు వివరించారు. అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు, న్యాక్ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దళిత గిరిజనుల అభివృద్ధికి ఎయిమ్ కృషి

దెందులూరు : ప్రతి గ్రామంలో దళితులు, గిరిజనుల అభివృద్ధికి, జీవన విధానం మారడానికి అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డీజీపీ పీవీ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు ఎయిమ్ స్పెషల్ టీం స్టేట్ కోఆర్డినేటర్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు పోడేటి రాంబాబు అన్నారు. గురువారం ఉభయగోదావరి జిల్లాలో పర్యటనలో భాగంగా పోతునూరులో ఆయన మాట్లాడుతూ దళితులు, గిరిజనులు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలతో పాటు అన్ని రంగాల్లో నూరు శాతం అభివృద్ధి చెందాలన్నది ఎయిమ్ తొలి లక్ష్యమన్నారు. ఈ దిశగా అన్ని గ్రామ శివారు ప్రాంతాల్లోని దళిత, గిరిజనవాడల్లో అవగాహన సభలు, సమావేశాలు, ముఖాముఖి కార్యక్రమాలు అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నామన్నారు. దళితులంతా ఐకమత్యంగా ఉండి అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారం పొందాలని రాంబాబు అన్నారు.

త్వరలో సర్వసభ్య సమావేశం

పెదవేగి: పెదవేగి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించుకోవచ్చని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ గురువారం తెలిపారు. బుధవారం ఈ సమావేశం జరగాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమావేశం నిర్వహించరాదని జిల్లా అధికారులు తెలియజేయడంతో మధ్యాహ్నం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశాన్ని రద్దు చేశారు. సమావేశం రద్దుచేస్తున్నట్లు సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు ఎంపీడీవో కార్యాలయం నుంచి సమాచారం అందజేశారు. అయితే సమావేశాల నిర్వహణకు ఎన్నికల కోడ్ అమలులోకి రాక ముందే అనుమతి పొందిన కారణంగా సమావేశాలు నిర్వహించుకోవచ్చని గురువారం ఆదేశాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో పెదవేగి మండల పరిషత్ సమావేశం త్వరలో నిర్వహిస్తామని ఎంపీడీవో రాజ్ మనోజ్ తెలిపారు.

మహిళను కొట్టి, బెదిరించిన వ్యక్తిపై కేసు

ద్వారకాతిరుమల : ఇల్లు ఖాళీ చేయాలని ఒక మహిళను కొట్టి, బెదిరించిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని గుణ్ణంపల్లికి చెందిన నక్కా లక్ష్మి నివసిస్తున్న ఇల్లు తనదంటూ, ఆమె భర్త మొదటి భార్య కుమారుడు నక్కా నరసింహరాజు ఈనెల 15న సాయంత్రం సదరు ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి, ఆమెను కొట్టాడు. ఇల్లు ఖాళీ చేయకపోతే చంపేస్తానని బెదిరించాడు. దీనిపై బాధితురాలు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సబ్‌జైలును సందర్శించిన జడ్జి

చింతలపూడి : స్థానిక సబ్‌జైల్‌ను గురువారం జడ్జి ఎస్‌కే ఇబ్రహీం షరీఫ్ సందర్శించారు. ఈ సందర్భంగా జైలు అధికారుల నుంచి కేసులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే జైలులో శిక్ష అనుభవిస్తున్న వారికి అందుతున్న వసతి, వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిక్ష అనుభవిస్తున్న వారు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలన్నారు. చెడుకు దూరంగా ఉండాలని, కష్టపడి పని చేసే తత్వం అలవాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు మీసాల రమేష్, సందిపాము సర్వయ్య, రాచప్రోలు విక్రమ్, పట్నాల శ్రీనివాస్, సోషల్‌వర్కర్ ఎండీ అక్బర్ ఆలీ, జైలు సూపరింటెండెంట్ గోలి వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీని అరికట్టాలి

చింతలపూడి : ఇటీవల ప్రగడవరం గ్రామ పంచాయతీ పరిధిలోని పొలాల్లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లు చోరీ జరుగుతున్న నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం చింతలపూడి మండల అధ్యక్షుడు కనమతరెడ్డి చంద్రశేఖరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌ల జంపర్లు తప్పించి ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టి వాటి నుంచి కాపర్ వైరు, ఖరీదు గల ఆయిల్ చోరీ చేస్తున్నారన్నారు. ఇలా పంచాయతీ పరిధిలో వారంరోజుల్లోనే 8 ట్రాన్సుఫార్మర్‌లు ధ్వంసమయ్యాయన్నారు. దీంతో విద్యుత్ సరఫరా లేక మొక్కజొన్న, పామాయిల్ , మిరప పంటల రైతాంగం తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ వేదకుమారికి సత్కారం


వేదకుమారిని సత్కరిస్తున్న గంటా ప్రసాదరావు

దెందులూరు : విజయవాడ శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్‌గా పదవీ పొందిన వేదకుమారి అభినందనీయురాలని నర్సాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు అన్నారు. గురువారం దెందులూరులో ఆమె నివాసంలో వేదకుమారి, కృష్ణ దంపతులను సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందచేశారు. ఏలూరు జిల్లాలో దెందులూరు నియోజకవర్గంలో రెండు కీలక పదవులను ఇద్దరు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఇవ్వడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. పదవులు ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, ఎంపీటీసీలు తాళ్లూరి నాగరాజు, పులిపాటి ఆనంద్, తోట విజయకుమారి, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, పార్టీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, కొంగర రత్నకుమార్ అబ్బాస్, నాయకులు పులిపాటి శ్యామలాదేవి, వన్నెకూటి సుందరం ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన యాదవ సంఘ నేతలు


ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న యాదవ సంఘ నేతలు

దెందులూరు : ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన ముస్సే శ్రీను, యాదవ సంఘ నేతలు గురువారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ముస్సే శ్రీనును అభినందించారు. తనకు పదవీ కల్పించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని ముస్సే శ్రీను తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి యాదవ సామాజిక వర్గం తరపున తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర మాజీ మంత్రి మరడాని రంగారావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గంటాప్రసాదరావు చెప్పారు. హస్తకళల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.సూర్యనారాయణ, భోగాపురం సర్పంచ్ దిమ్మిటి రమేష్, యాదవ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

భీమడోలులో రైతుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

భీమడోలు : విద్యుత్‌రంగ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం భీమడోలు విద్యుత్ ఏఈ కార్యాలయం వద్ద రైతులు, రైతు నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు వల్ల రైతులు, సంబంధిత ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఉచిత విద్యుత్ పథకానికి నగదు బదిలీ అమలు చేయవద్దన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల పెట్టవద్దని, జలకళలో వేసిన బోర్లకు విద్యుత్ కనెక్షన్ల ఖర్చును ప్రభుత్వమే భరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, రైతులు గుర్రం రాంబాబు, గుర్రం పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

ద్వారకాతిరుమల : ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక శ్రీశ్రీనివాస డిగ్రీ కళాశాలలో రిజర్వు బ్యాంక్ వారు అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలన్నారు. అనంతరం స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగేశు మాట్లాడుతూ విద్యార్థులు బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకోవాలన్నారు. రుణయాప్‌లకు ఎవరూ బలికాకూడదని, ఏ రుణ సదుపాయమైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకింగ్ సంస్థల నుంచే పొందాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దావులూరి దుర్గాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.